## రెవెన్యూ సిబ్బంది నిరసన



ఘట్‌కేసర్: వికారాబాద్ కలెక్టర్, ఇతర సిబ్బందిపై దాడిని ఖండిస్తూ ఘట్‌కేసర్ రెవెన్యూ కార్యాలయంలో ఇన్‌చార్జి తహసీల్దార్, నాయబ్ తహసీల్దార్ రాజేందర్ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నల్లబ్యాడ్జీలు ధరించి దాడికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రెవెన్యూ అధికారుల భద్రత విషయంలో ప్రభుత్వం జోక్యం చేసుకోవాలన్నారు. ప్రతి రెవెన్యూ కార్యలయంలో భద్రత కోసం ఇద్దరు పోలీసులను కేటాయించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## పథకాలపై అవగాహన



సదస్సులో విద్యార్థులు, తల్లిదండ్రులు

మేడ్చల్: మేడ్చల్ పట్టణంలోని సెయింట్ ఆన్స్ మనోవికాస్ కేంద్రంలో మంగళవారం ఉపాధ్యాయులు మానసిక వికలాంగ విద్యార్థులు వారి తల్లి దండ్రులతో అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో నేషనల్ ఇన్స్టిట్యూట్ ఫర్ ఎమ్మార్ సికింద్రాబాద్ బృందం వారు ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు, మానసిక వికలాంగులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు. సదరం సర్టిఫికేట్లు, యూడిఐడి హెల్త్ ఇన్సూరెన్స్ వంటి పథకాల గురించి వివరించారు. సమావేశంలో పాఠశాల కరస్పాండెంట్ జాయిస్, ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

## శరవేగంగా అభివృద్ధి పనులు



డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న మేయర్ శాంతి, కార్పొరేటర్ శ్రీనివాస్

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని మేయర్ శాంతి అన్నారు. 21వ డివిజన్ కార్పొరేటర్ ప్రేమల శ్రీనివాస్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లో మున్సిపల్ సాధారణ నిధులు రూ.10 లక్షల వ్యయంతో భూగర్భ డ్రైనేజీ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ శాంతి మాట్లాడుతూ.. ప్రగతి పనులతో ముందడుగు వేస్తున్నామన్నారు. అన్ని కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్, సీనియర్ నాయకులు సదానంద్, బాలరాజు, యాదగిరియాదవ్, రాంచందర్, బాలు తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర సర్వే పరిశీలన



ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో జరుగుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను చైర్‌పర్సన్ పావనీజంగయ్య పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సర్వే అంశాలను సర్వేకు వచ్చిన సిబ్బంది ఎట్టి పరిస్థితులలోనూ బహిర్గతం చేయరన్నారు. అపోహలు వీడి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు ప్రజలందరు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మేనేజర్ మల్లారెడ్డి, కులగణను అధికారులు, ఎన్యూమరేటర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## నర్సింహారెడ్డి కళాశాలలో ముగిసిన సాంకేతిక స్థాయి సదస్సు

నర్సింహారెడ్డి కళాశాలలో ముగిసిన సాంకేతిక స్థాయి



ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, మేనేజ్‌మెంట్ అండ్ సైన్సెస్ నూతన విధానాలపై రెండు రోజుల పాటు నిర్వహించిన జాతీయ స్థాయి సదస్సు మంగళవారం ముగిసింది. సదస్సులో వివిధ రాష్ట్రాల నుంచి 60 కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొని సాంకేతికంగా వచ్చే వినూత్న మార్పులను వివరించారు. సదస్సుకు 150కి పైగా పేపర్ ప్రజెంటేషన్స్, ప్రదర్శనలు రాగా ఉత్తమ ప్రదర్శన కనబర్చిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ నర్సింహారెడ్డి, కార్యదర్శి త్రిశూల్ రెడ్డి, కోశాధికారి త్రిలోక్‌రెడ్డి, డైరెక్టర్ మోహన్, ప్రిన్సిపాల్ లోకనాథం, వైస్ ప్రిన్సిపాల్ పురుషోత్తం ప్రసాద్, కోఆర్డినేటర్లు శశికళ, దిలీప్‌రెడ్డి, పవిత్ర, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ఘట్‌కేసర్: ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్) నుంచి మంజూరైన పలు చెక్కులను మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీజంగయ్య, కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వజ్రేశ్‌యాదవ్‌తో కలిసి మంగళవారం అందజేశారు. అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందిన ఎన్‌ఎఫ్‌నగర్‌కు చెందిన సాయికుమార్ రూ. 60 వేలు, బాలాజీనగర్‌కు చెందిన రాజేందర్‌రెడ్డికి రూ. 60 వేలు సీఎంఆర్‌ఎఫ్ నిధుల నుంచి మంజూరు కాగా బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మున్సిపల్ ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణముదిరాజ్, వెంకటేష్ ముదిరాజ్, ప్రభాకర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, జంగారెడ్డి, యూత్ కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి శివప్రదీప్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, సునిల్‌కుమార్ పాల్గొన్నారు.

# పక్కాగా పశుగణన



| మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో పశుగణన ఇలా | |
|---|---|
| మండలాలు | 15 |
| లొకేషన్లు | 279 |
| ఎన్యుమరేటర్లు | 79 |
| సూపర్ వైజర్లు | 16 |
| నోడల్ అధికారి | 01 |

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 21వ జాతీయ పశుగణన ప్రారంభమైంది. ఆగస్టులోనే మొదలు కావాల్సిన పశుగణన అనివార్య కారణాల వల్ల వాయిదా పడింది. ప్రతి ఐదేళ్లకోసారి పశుగణన చేయాల్సి ఉంటోంది. 2018లో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పశుగణన జరిగింది. జిల్లాలో దీనికి సంబంధించి పశుగణకులు, (సూపర్‌వైజర్లు) పర్యవేక్షకులకు శిక్షణ పూర్తి చేశారు. ఈ పశుగణన పూర్తిగా డిజిటల్ విధానంలో చేస్తున్నారు. అందుకు తగిన విధంగా సమాచారం సేకరిస్తున్నారు. ఫిబ్రవరి 25 వరకు మేడ్చల్ జిల్లాలో పశుగణన పూర్తయ్యేలా జిల్లా పశుసంవర్ధక శాఖ చర్యలు తీసుకుంటోంది. జనాభా ఆధారంగా రెండు, మూడు లొకేషన్లను కలిపి ఒక సూపర్‌వైజర్ నియమించారు. – సాక్షి, సిటీబ్యూరో

- ఐదేళ్ల తర్వాత కొనసాగుతున్న పశుగణన
- 2018లో చేపట్టిన కేంద్ర ప్రభుత్వం
- ఫిబ్రవరి 25 కల్లా పూర్తయ్యేలా జిల్లా పశు సంవర్ధక శాఖ కసరత్తు
- పశుసంపద ద్వారా వచ్చే ఆర్థికాదాయం, నిధుల మంజూరు తదితర వాటిపై దృష్టి

### డిజిటల్ విధానంలో..

జిల్లాలో ఇప్పటికే పశుగణకులు క్షేత్రస్థాయిలో సమాచారం సేకరించారు. డిజిటల్ విధానంలో యాప్ ద్వారా గణన చేసేందుకు అవసరమైన యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ ఇచ్చారు.. ఈ నెల 5 నుంచి మేడ్చల్ జిల్లాలో పూర్తిస్థాయిలో డిజిటల్ విధానంలో పశుగణనను ఎన్యుమరేటర్లు చేపడుతున్నారు.

### ప్రణాళికా అవసరాల కోసం..

భారతదేశం విభిన్న పశు సంపదకు నిలయం. పశు సంపద ద్వారా వచ్చే ఆర్థికాదాయం గణనీయమైన పాత్ర పోషిస్తోంది. అభివృద్ధి, సంక్షేమం కోసం పశుగణన చాలా కీలకమైనది. ఏయే జాతి పశువుల సంతతి ఎంత ఉంది?, ఏది తగ్గుతోంది?, ఏది పెరుగుతుంది? అనే విషయం పశుగణన ద్వారా కూడా తెలుస్తోంది. కేంద్ర ప్రభుత్వం తగిన ప్రణాళిక తయారు చేసి పశు సంపద అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తోంది.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో గడిచిన లెక్కల ప్రకారం వివిధ జాతుల పశువుల వివరాలు ఈ విధంగా ఉన్నాయి. జిల్లాలో గోజాతి పశువులు 27,068 ఉండగా, గేదె జాతి పశువులు 59,895 ఉన్నాయి. గొర్రెలు1,49,401, మేకలు 40,020, పందులు 2,485, కోళ్ల సంఖ్య 39,72,037 ఉన్నట్లు జిల్లా పశుసంవర్ధక శాఖ అంచనా వేస్తోంది.

### రైతులు సహకరించాలి

పశుగణకులు ఇంటికి వచ్చినప్పుడు రైతులు తమ పశువుల వివరాలను నమోదు చేయించుకోవాలి. జిల్లాలో ఏజాతి పశువులు ఎన్ని ఉన్నాయనే విషయం తెలుస్తోంది. దీనికి అనుగుణంగా పశుసంవర్ధకశాఖ మందుల సరఫరా చేయటం, ఇతర సంక్షేమ కార్యక్రమాల అమలుకు ఉపయోగపడుతుంది. రైతులందరూ సహకరించాలి.

– డాక్టర్ సుధాకర్, పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి

## నేడు ఎక్సైజ్ స్టేషన్‌లో వాహనాల వేలం

పోచారం: నారపల్లిలోని ఘట్‌కేసర్ ఎక్సైజ్ స్టేషన్‌లో బుధవారం ఉదయం 11 గంటలకు నాలుగు యాక్టివా ద్విచక్ర వాహనాలను వేలం వేస్తున్నట్లు సీఐ జూపల్లి రవి తెలిపారు. ఆసక్తి కలిగిన వ్యక్తులు వేలం పాటలో పాల్గొనవచ్చన్నారు. వివరాల కోసం 8712658736, 9642377661, 9640097624 నెంబర్లకు ఫోన్ చేయవలసిందిగా తెలిపారు.

## బస్తీ దవాఖాన పనులు పునరుద్ధరించాలి



మల్కాజిగిరి: ఓల్డ్ మల్కాజిగిరి రామాలయం వద్ద ఉన్న కమ్యూనిటీహాల్‌లో బస్తీ దవాఖాన ఏర్పాటు పనులను పునరుద్ధరించాలని కార్పొరేటర్ శ్రవణ్ జీహెచ్‌ఎంసీ హెల్త్ విభాగం అసిస్టెంట్ కమిషనర్ పంకజకు వినతిపత్రం అందజేశారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండటానికి కేంద్ర ప్రభుత్వం వైద్యానికి ప్రాముఖ్యతనిస్తూ.. నిధులు మంజూరు చేస్తోందన్నారు. బస్తీలో మెరుగైన సేవలందిస్తే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని, బస్తీ దవాఖాన త్వరితగతిన ఏర్పాటు చేయాలని కోరానన్నారు.

## కలెక్టర్‌పై దాడికి నిరసనగా ఆందోళన



సాక్షి,సిటీబ్యూరో: వికారాబాద్ జిల్లా కలెక్టర్, ఇతర అధికారులపై జరిగిన దాడిని నిరసిస్తూ.. మంగళవారం మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట భోజన విరామ సమయంలో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డితో కలిసి తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా అధికారులు, ఉద్యోగులు అందరూ నల్ల బ్యాడ్జిలు ధరించి ఆందోళనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులకు భద్రత కల్పించాలని వారు కోరారు. ఇటువంటి ఘటన వల్ల అభద్రతాభావన కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దాడికి పాల్పడిన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఆందోళనా కార్యక్రమంలో టీజీఏ జిల్లా నేతలు, వివిధ శాఖలకు చెందిన అధికారులు విజయకుమారి, సైదులు, వినోద్ కుమార్, రాంమోహన్, కురుమూర్తి శ్రీనివాస్‌మూర్తి, రాజేశ్వర్‌రెడ్డి వివిధ శాఖల ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## టీచర్లపై చర్యలు తీసుకోవాలంటూ జేఏసీ డిమాండ్



సాక్షి,సిటీబ్యూరో: జూన్‌లో జరిగిన టీచర్ల బదిలీ కౌన్సిలింగ్‌లో స్పౌజ్ పాయింట్లు దుర్వినియోగం చేసిన ఉపాధ్యాయులపై చర్య తీసుకోకుండా తాత్సారం చేయడంపై ఈ నెల 21న కలెక్టరేట్ వద్ద పెద్ద ఎత్తున ధర్నా చేయనున్నట్లు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఉపాధ్యాయ సంఘాల జేఏసీ హెచ్చరించింది. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లోని జిల్లా విద్యాశాఖ ఏడీ లింగానందంకు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు నోటీసులతో కూడిన వినతి పత్రం అందజేశారు. బదిలీ కౌన్సిలింగ్‌లో స్పౌజ్ పాయింట్ల దుర్వినియోగంపై సంబంధిత టీచర్లపై చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ రాష్ట్ర ఉన్నతాధికారులతో సహా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారులకు వినతి పత్రాలు సమర్పించినప్పటికీ ఇప్పటి వరకు ఏలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత టీచర్లపై చర్యలు తీసుకోవటంలో జరుగుతున్న తాత్సారాన్ని నిరసిస్తూ.. ఈ నెల 21న ధర్నా చేయనున్నట్లు వారు పేర్కొన్నారు. జిల్లా విద్యాశాఖ ఏడీకి వినతి అందజేసిన వారిలో ఉపాధ్యాయ సంఘాల జేఏసీ జిల్లా నాయకులు జయసింహారెడ్డి(టీఎస్‌యూటీఎఫ్), వెంకటేశ్వర్లు (ఎస్టీయూటీఎస్), రాజ్‌కుమార్ (టీపీయూఎస్), విఠల్(టీయూటీఎఫ్), బ్రహ్మాచారి(టీపీటీఎఫ్) ఉన్నారు.

## అధికారులపై దాడులు సరికాదు



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసిన టీజీఏ జిల్లా నేతలు

సాక్షి,సిటీబ్యూరో: వికారాబాద్ జిల్లాలోని దుద్యాల మండలం లగిచర్ల గ్రామంలో వికారాబాద్ జిల్లా కలెక్టర్, అడిషనల్ కలెక్టర్, ఇతర అధికారులపై జరిగిన దాడిని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం(టీజీఏ) జిల్లా అధ్యక్షుడు వినోద్ కుమార్, ప్రధాన కార్యదర్శి కురుమూర్తి తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లోని వివిధ విభాగాల్లో పని చేసే అధికారులు, ఉద్యోగులు వికారాబాద్ కలెక్టర్‌పై దాడికి నిరసనగా నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. టీజీఏ పిలుపు మేరకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా అధికారులు, ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహించినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వినోద్ కుమార్ తెలిపారు. ఇలాంటి సంఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతూ మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్‌కు టీజీఏ జిల్లా నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు వినోద్ కుమార్, కురుమూర్తి, వెంకటేశం, కర్ణాకర్‌రెడ్డితో సహా జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## నేడు అభ్యర్థనలు ఇవ్వండి

సాక్షి,సిటీబ్యూరో: తెలంగాణలో స్థానిక సంస్థల వారిగా కల్పించాల్సిన రిజర్వేషన్ల దామాషాకు సంబంధించి అభ్యనర్థనలు, సలహాలు, ఆక్షేపణలను స్వీకరించేందుకు కొంగరకలాన్‌లోని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయానికి డెడికేటెడ్ కమిషన్ బృందం ఈ నెల 13న వస్తోందని, ఆసక్తి కలిగిన వారందరూ వారిని కలువచ్చునని బీసీ అభివృద్ధి శాఖ జిల్లా అధికారి ఇందిర ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా ప్రతినిధులు, పార్టీల నాయకులు, బీసీసంఘాలు, ప్రజలు అందజేసే వినతి పత్రాలను కమిషన్ బృందం స్వీకరిస్తుందన్నారు. ఈనెల 13న ఉదయం 10.30 గంటల నుంచి అభ్యర్థలను తీసుకుంటారని పేర్కొన్నారు. కమిషన్ బృందంలో చైర్మన్ బుసాని వెంకటేశ్వరరావు, సెక్రెటరీ సైదులు తదితరులు ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ఆమె తెలిపారు.

## మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యం

శామీర్‌పేట్: మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యమైన ఘటన శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. శామీర్‌పేట మండలం, అలియాబాద్‌కు చెందిన బాలేష్ (42), గత కొద్ది రోజులుగా మతిస్థిమితం కోల్పోయాడు. ఈ క్రమంలో గత నెల 15న మధ్యాహ్నం బాలేష్ ఇంటి నుంచి బయటకి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ప్రాంతాలతోపాటు బంధువుల ఇళ్ల వద్ద వెతికారు. అయినప్పటికీ ఫలితం లేకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## అతివేగంతో వాగులోకి దూసుకెళ్లిన కారు



వాగులోకి దూసుకెళ్లిన కారు

శామీర్‌పేట్: అతివేగంతో ఓ కారు వాగులోకి దూసుకెళ్లిన ఘటన శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధి జగ్గంగూడ నుంచి టీఎస్ 15 ఈపీ 2799 నెంబరు గల కారులో నలుగురు వ్యక్తులు బొమ్మరాశిపేట వైపు అతివేగంగా వస్తున్నారు. ఈ క్రమంలో శామీర్‌పేట పెద్దచెరువు నుంచి వచ్చే వాగుపై ఉన్న బ్రిడ్జి (వంతెన) వద్దకు రాగానే కారు అదుపు తప్పి బ్రిడ్జి పై నుంచి వాగులోకి దూసుకెళ్లి బోల్తా పడింది. కారులో ప్రయాణిస్తున్న నలుగురికి గాయాలు కాగా ఆర్‌వీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులుకేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి



దేవర్ల వీరేశ్వరి మృతదేహం

కీసర: అనుమానాస్పద స్థితిలో ఓ మహిళ మృతి చెందిన ఘటన కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. సీఐ. వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా కొత్తకోట మండలం తిరులయిపల్లికి చెందిన దేవర్ల వీరేశ్వరి(23) మూడు రోజుల క్రితం భర్తతో గొడవపడి, రెండేళ్ల కూతురితో హైదరాబాద్‌కు వచ్చింది. కర్ణాటక రాష్ట్రం బెంగుళూరులో పని చేసినప్పుడు పరిచయం ఉన్న బందన్న ఆమెను కీసరలో సిమెంట్ ఇటుకల తయారీ కేంద్రానికి తీసుకువచ్చాడు. గత రెండు రోజులుగా అక్కడే పని చేస్తున్న ఆమె మంగళవారం గదిలో ఉన్న సిమెంట్ బస్తా తలపై పెట్టుకొని వస్తుండగా ప్రమాదవశాత్తు జారిపడింది. ఈ ఘటనలో ఆమె తలకు బలమైన గాయంకావడంతో ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతురాలి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అదృశ్యం

కుషాయిగూడ: ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అదృశ్యమైన ఘటన మంగళవారం కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం.. చక్రిపురం, హైటెన్షన్ లేన్‌లో ఉండే విక్రమ్ (24) గచ్చిబౌలిలోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈనెల 11న సాయంత్రం బైక్‌పై వెళ్లి తిరిగి రాలేదు. ఆచూకీ కోసం కుటుంబసభ్యులు వెతికినా దొరకలేదు. పోలీసులు అతడి సోదరి స్మిత మోహతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

అల్వాల్: అల్వాల్ డివిజన్ ఆదర్శనగర్ సెయింట్ జేవియర్స్ స్కూల్ వద్ద జరుగుతున్న బాక్స్ డ్రైనేజీ నిర్మాణ పనులను మంగళవారం కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాక్స్ డ్రైనేజీ నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి, త్వరితగతిన పూర్తి చేయాలని ఆమె కాంట్రాక్టర్‌కు సూచించారు. ఏఈ అభిషేక్, రామారావు, ప్రేమ్, సాజిద్, సర్వేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు



విజేతలను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

ఘట్‌కేసర్: క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు ఉందని, వారికి జీవితంలో ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని మహేంద్రహిల్స్ సాంఘీక సంక్షేమ డిగ్రీ మహేంద్రహిల్స్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ స్నేహలత అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో ఈ నెల 9, 10 తేదీల్లో సింథటిక్స్ ట్రాక్‌లో నిర్వహించిన అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్, ఈ నెల 2,3 తేదీల్లో ఖమ్మం సర్దార్ వల్లాబాయ్ పటేల్ స్టేడియంలో నిర్వహించిన కేయూ ఇంటర్ కాలేజ్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో బంగారు, వెండి, రజిత, కాంస్య పథకాలతో విజేతలను మంగళవారం మహేంద్రహిల్స్ కళాశాలలో అభినందించారు. ఈ సందర్భంగా వారికి మెడల్స్, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ స్వరూప రాణి, విజయలక్ష్మి, మోహిని, వసంత, శివకుమారి, జ్యోతి, రామలక్ష్మణ్, సుమలత, కవి, శ్వేత, అథ్లెటిక్స్ కోచ్ భిక్షపతి, అధ్యాపకులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధుడి అదృశ్యం

జవహర్‌నగర్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన వృద్ధుడు అదృశ్యమైన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాప్రా సాయిబాబానగర్ పోచమ్మ గుడి సమీపంలో అనూప్ కుటుంబ సభ్యులతో కలిసి నివాసముంటున్నాడు. తన మామయ్య నాగేంద్రనాథ్ భునియా (74) ఈ నెల 4న కాలినడక కోసమని బయటకు వెళ్లి ఇంటికి తిరిగిరాలేదు. అతని ఆచూకీ కోసం తెలిసిన ఎంత వెతికినా ఫలితం లేకవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

### మహిళ అదృశ్యం

తుకారాంగేట్ వడ్డెర బస్తీలో నివసించే హరీష్, తల్లి లక్ష్మి, కుటుంబ సభ్యులతో కలిసి ఉంటున్నారు. లక్ష్మి(56) కొకూర్‌లోని ఓం శ్రీగ్రాండ్ అపార్టుమెంట్‌లో హౌస్ కీపింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఈ నెల 1న అపార్టుమెంట్‌లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లి ఆమె తిరిగిరాలేదు. ఆమె ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## రెండు సంఘటనల్లో 20 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత





పట్టుబడిన రమేష్, నిఖిల్‌నాయక్



పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

అక్రమంగా రేషన బియ్యం తరలిస్తున్న వారిపై కేసు

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ఘట్‌కేసర్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ పరశురాం తెలిపిన వివరాల ప్రకారం.. అవుషాపూర్ గ్రామానికి చెందిన దరావత్ రమేష్ (28) గ్రామంలో కిలో రేషన్ బియ్యాన్ని రూ. 10లకు కొనుగోలు చేసి సంగారెడ్డిలో పౌల్ట్రీ ఫామ్‌లో రూ. 13–15లకు విక్రయించడానికి తరలిస్తుండగా గ్రామ సరిహద్దులో 5 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నారు. అలాగే ఎదులాబాద్‌కు గ్రామంలో పొట్టిమేరి తండా, చిన్న లక్ష్మాపూర్, తుర్కపల్లి మండలానికి చెందిన మూడావత్ నిఖిల్ నాయక్ (27)స్థానికుల నుంచి కొనుగోలు చేసి ఎదులాబాద్ గంగపుత్ర సంఘం సమీపంలో ఉన్న ఖాళీ ప్రదేశంలో నిల్వ చేశాడు. గోల్కొండకు తరలిస్తుండగా 15 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# నేడు కరెంట్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్‌రూరల్: విద్యుత్ మరమ్మత్తులు, విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు. మేడ్చల్ మున్సిపాలిటీ పరిధి 11 కేవీ జ్యోతినగర్ ఫీడర్ పరిధిలో మరమ్మత్తుల కారణంగా ఇందిరానగర్, కిందిబస్తీ, మజీద్ ప్రాంతం, సంతోష్‌మాత లైన్, మార్కెట్ ప్రాంతం, చాకలిబస్తీ, బృందావనం కాలనీ, టీచర్స్ కాలనీ, జ్యోతినగర్ వెంచర్ ప్రాంతాల్లో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 3 గంటలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

### గౌడవెల్లిలో...

11 కేవీ గౌడవెల్లి మరియు ఐడీఏ గౌడవెల్లి ఫీడర్ల పరిధిలో మరమ్మతుల కారణంగా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు గౌడవెల్లి గ్రామంతో పాటు గ్రామ పరిధిలోని కంపెనీలు, గోదాంలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్ అధికారులు తెలిపారు.

### కీసరలో..

రాంపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కే.వీ. రామాలయం ఫీడర్ మరమ్మత్తుల కారణంగా నేడు (బుధవారం)ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు ప్రజాసాయిగార్డెన్, హెవెన్‌గార్డెన్ కాలనీ, శ్రీనివాస్‌నగర్ కాలనీ, ఆర్టీసీకాలనీలో విద్యుత్ అంతరాయం ఉంటుందని, ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించాలని, కీసర విద్యుత్ ఏఈ మురళీ కృష్ణ తెలిపారు.

### పోచారంలో..

నారపల్లిలోని 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతులు చేపట్టినందున బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ప్రదీప్ కుమార్ తెలిపారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కొర్రెముల్, చౌదరిగూడ, వెంకటాపూర్, మక్త, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, బాలాజీనగర్, సాదత్‌అలీగూడ, సుప్రభాత్ టౌన్‌షిప్, ఓయూ కాలనీ, కొర్రెముల్ క్రాస్ రోడ్ ప్రాంతాలకు కరెంట్ ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

### శామీర్‌పేట్‌లో..

నేడు (బుధవారం) తూంకుంటలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని శామీర్‌పేట విద్యుత్ ఏఈ రాఘవేందర్‌రావు తెలిపారు. శామీర్‌పేట సబ్ స్టేషన్ పరిధిలోని తూంకుంట 11 కేవీ ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా తూంకుంటతో పాటు సమీప ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ అధికారి తెలిపారు.